క్లుప్తంగా

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి



జి.కొండూరు: మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగుతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం. రాంకుమార్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చెర్వుమాధవరం గ్రామంలో మొక్కజొన్న రైతులకు సస్యరక్షణ చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ మండల పరిధిలో 396 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోందన్నారు. కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐ, ఏఎస్ఐకి సన్మానం



చాట్రాయి: విధుల్లో ప్రతిభ కనపరిచి కలెక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్ఐ డి.రామకృష్ణ, ఏఎస్ఐ గజపతిలను ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. చోరీ సొత్తును రికవరీ చేయడంలో మంచి ప్రతిభ కనపరిచారని ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు కొనియాడారు. రఘురాం, కొమ్ము ఆనందం, జోషి, లాజరు తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్



తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం దోమల నిర్మూలనకు పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. చిట్టేల, ఆంజనేయపురం, మునుకుళ్ల, లక్ష్మీపురం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల పర్యవేక్షణలో సిబ్బంది ఫాగింగ్ చేశారు.


మధ్యాహ్న భోజనం పరిశీలన

ఇబ్రహీంపట్నం: చిలుకూరు, కొటికలపూడి ఎంపీయూపీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంపీపీ పాలడుగు జోత్స్న మంగళవారం పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. భోజనం రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సూచించారు. చిలుకూరు గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణాలకు రూ.21 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. చిలుకూరు సర్పంచి సురేష్ పాల్గొన్నారు.

పాలకవర్గం ఎన్నిక జరపాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీకి ఎన్నికలు జరిగి మూడేళ్లు అవుతున్నా పాలకవర్గం ఏర్పాటు కాలేదని డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. వెంటనే పాలకవర్గం ఎన్నికకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నాయకుడు పోతురాజు ఏసుదాసు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్‌లో వార్షిక తనిఖీ



ముసునూరు: చిన్నారుల స్థాయిని అనుసరించి పాఠ్యాంశాలను బోధించాలని, ప్రతి పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు సూచించారు. చింతలవల్లి ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఏ–3 పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ మూడో జోన్‌కు నీరు ఇవ్వాలి

విస్సన్నపేట: నాగార్జున సాగర్ ఎడమ కాలువ మూడో జోన్‌కు నిరాటంకంగా 1500 క్యూసెక్కుల సాగర్ జలాలు సరఫరా చేయాలని ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు కోరారు. మండలంలోని కలగర రామచంద్రాపురంలో 117 హెడ్ రెగ్యులేటర్ వద్ద సాగర్ జలాలను ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణతో కలిసి వీరబాబు పరిశీలించారు. ప్రస్తుతం 800 క్యూసెక్కులు మాత్రమే నీరు వస్తోందని, 1700 క్యూసెక్కులు వస్తేనే ఆయకట్టుకు నీరందుతుందని వీరబాబు తెలిపారు. ఎన్ఎస్‌పీ సూపరింటెండింగ్ ఇంజినీర్ మొహిద్దీన్ సాగర్ జలాల సరఫరా పెంపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దోమల దండయాత్ర





తిరువూరు-మధిర ఆర్ అండ్ బీ రహదారి పక్కన చెత్త కుప్పలు ; తిరువూరు మండలం గానుగపాడులో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

- దోమకాటుతో జ్వరాల బారిన ప్రజలు
- నామమాత్రంగా దోమల నిర్మూలన చర్యలు
- గ్రామాల్లో పారిశుద్ధ్య లేమితో ఇబ్బందులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో దోమల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారు. పారిశుద్ధ్య లేమితో పలు గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. రోజుల తరబడి నిలిచిపోతున్న మురుగునీటితో దోమలు ప్రబలుతున్నాయని, దోమకాటుతో జ్వరాల బారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. గత నెల రోజులుగా పగలు, రాత్రి సైతం ఈ సమస్య నెలకొనడంతో దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తిరువూరు పట్టణంలోని వార్డుల్లో మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో పాటు నివాస గృహాల నడుమ నిలిచిపోతున్న నీటి కారణంగా దోమలు ప్రబలుతున్నాయి.

గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యతో సతమతం

తిరువూరు మండలంలోని చింతలపాడు, రోలుపడి, ఆంజనేయపురం, మల్లేల, కాకర్ల, ముష్టికుంట్ల, గానుగపాడు, చౌటపల్లి, కోకిలంపాడు, అక్కపాలెం గ్రామాల్లో, ఎ. కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల్లోని మైనర్ పంచాయతీల్లో రోడ్ల పక్కన పేడకుప్పలు పడేస్తుండటంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. గ్రామ పంచాయతీల్లో చెత్తచెదారం తొలగింపునకు గతంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించినప్పటికీ వారికి వేతనాలు చెల్లించకపోవడంతో విధులకు హాజరవడం లేదు. చెత్త రీసైక్లింగ్‌కు పలు గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. ఉపాధి హామీ పథకంలో కేటాయించిన చెత్త తరలింపు వాహనాలు, ఎలక్ట్రికల్ ఆటోలు మూలపడ్డాయి.

నిధులు కేటాయించాలి

తిరువూరు నగర పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో దోమల నిర్మూలన చర్యలు నామమాత్రంగా సాగుతున్నాయి. ఫాగింగ్ యంత్రాలు, మలాథియాన్ పిచికారీ చేసే స్ప్రేయర్లు సరిపడా లేని కారణంగా దోమల నిర్మూలన సాధ్యపడటం లేదు. పంచాయతీలకు దోమల నిర్మూలన నిమిత్తం నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

గ్రామాల్లో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. దోమకాటుతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నందున పంచాయతీ అధికారులు ఫాగింగ్ చేయించాలి.

– మోదుగు శివయ్య, ముష్టికుంట్ల



మురుగు కాలువలు ఏర్పాటు చేయాలి

పక్కా డ్రెయిన్లు లేక తిరువూరు పట్టణంలో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. తాత్కాలిక డ్రెయిన్లు నిర్మించాలి.

– షేక్ నాగుల్‌మీరా, తిరువూరు



ఫాగింగ్ చేయిస్తున్నాం

తిరువూరు పట్టణంలో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నాం. దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రజలు చెత్త చెదారాన్ని రోడ్లపై వేయకుండా సిబ్బందికి అప్పగించాలి.

– లోవరాజు, నగర పంచాయతీ కమిషనర్, తిరువూరు

మామిడి రైతులను ఆదుకోవాలి

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా మామిడి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మైలవరం, రెడ్డిగూడెం కమిటీల ఆధ్వర్యంలో మామిడి తోటలను మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయన్నారు. మామిడిని నల్ల తామర పురుగు సోకి నూటికి 90 శాతం మామిడి పంట పూర్తిగా దెబ్బతిందని, గత మూడేళ్లుగా మామిడికి గులాబీ రంగు పురుగు, తామర పురుగు, ముడ్డిపుచ్చు తదితర వ్యాధులు సోకి పూత నల్లగా మాడిపోయి దిగుబడులు లేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించిందని, నేటికి అమలయ్యే పరిస్థితి లేదన్నారు. మామిడికి సోకే చీడపీడలపై ఉద్యాన శాఖాధికారులు రైతుల్లో అవగాహన కల్పించే ప్రయత్నం కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి తోటలకు పంటల బీమా సౌకర్యం కల్పించాలని, మామిడి రైతులకు ఉచిత బోర్లు పథకం అమలు చేయాలని, ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెడ్డిగూడెం, మైలవరం మండలాల రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం మంజూరు చేయాలని నిరసన

మైలవరం: వెల్వడం, చంద్రాల గ్రామాలలో ఆర్ అండ్ బీ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని సీపీఎం మైలవరం మండలం కార్యదర్శి చాట్ల సుధాకర్ అన్నారు. బాధితులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో మంగళవారం సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ఇళ్లు కోల్పోయి పదేళ్లు గడచినా బాధితులకు నష్టపరిహారం రాకపోవడానికి ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. పదేళ్లు గడుస్తున్నా రెవెన్యూ అధికారుల వద్ద ఎలైన్‌మెంట్ రిపోర్టు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. వారంలోగా బాధితులకు న్యాయం జరుగకపోతే తిరిగి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ అబ్దుల్ ధారియా అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. బాధితులు పాల్గొన్నారు.



వెల్వడం రహదారిలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బాధితులతో సుధాకర్

210 పశువులకు వైద్య పరీక్షలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం పశు సంవర్ధక శాఖ ఏడీ కె.రాధాకృష్ణ మూర్తి అన్నారు. తుమ్మలపాలెం గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి బొమ్మ వెంకటరమణ మంగళవారం ప్రారంభించారు. ఏడీ మాట్లాడుతూ పశు పోషకులు పాటించాల్సిన మెలకువలను వివరించారు. గేదెలు, గొర్రెలు, దూడలు మొత్తం 210 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఖనిజ లవణ మిశ్రమ దాణాలను పంపిణీ చేశారు. పశు వైద్యులు బి.స్వాతి, పూర్ణిమ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశు వ్యాధుల నివారణతో లాభాలు

ముసునూరు: పశువుల్లో వ్యాధులను నివారిస్తే పశు పోషకులు లాభాలు పొందొచ్చని మండల పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య అన్నారు. చింతలవల్లి, చిల్లబోయినపల్లి గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 75 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేసి, 720 దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్ కండెపు రామగిరిరావు, పశు వైద్య సహాయక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన యూనిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్-2024-25 పరీక్షలో మైలవరం వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో 100లోపు ర్యాంకులు సాధించారని హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం. లక్ష్మీప్రణీత (9వ తరగతి), ఎస్. ప్రశాంత్ (9వ తరగతి), టి. శివప్రియ (8వ తరగతి), ఇ. అనువర్షిణి (8వ తరగతి), కె. మధుశ్రీ (8వ తరగతి), ఎం. మధు (8వ తరగతి), ఎ. ఉమా సాయికృష్ణ (8వ తరగతి), జి. సాత్విక (7వ తరగతి), ఎం. శ్రీకిరణ్ (7వ తరగతి), వై.శరణ్య (7వ తరగతి), వై.హర్షిత (7వ తరగతి), వి. జాస్మిత (6వ తరగతి), వి.సూర్యవర్ధన్‌రెడ్డి (5వ తరగతి), ఏఏ ప్రసూన (4వ తరగతి), బి. ప్రణతి (4వ తరగతి) జాతీయ స్థాయిలో 100లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి. రాజారెడ్డి అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీనివాసరావు, రాజారెడ్డి, ఉపాధ్యాయులు

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: సమస్త జీవ కోటికి సూర్యుడే ప్రాణదాతగా ఉన్నారని ఎన్టీటీపీఎస్ ఈఈ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. ఫిబ్రవరి 4న రథ సప్తమిని పురస్కరించుకుని శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగథాన్ 108 సామూహిక సూర్య నమస్కారాల సప్తాహం ఇబ్రహీంపట్నం అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మానవాళికి ఆరోగ్యం, ఆయుష్షు, ఆహారం సకల సిరి సంపదలకు సూర్యుడు ప్రత్యక్ష దైవమన్నారు. సూర్య నమస్కారాలతో ఆరోగ్యం లభిస్తుందన్నారు. మరో వారం రోజులు సూర్య నమస్కారాల సప్తాహం జరుగుతుందని యోగా గురువు లంకే జనార్దన్ తెలిపారు. సామూహిక సూర్య నమస్కారాల సాధన చేశారు. ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధం

నూజివీడు: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30న వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 3న ఎన్నికను నిర్వహిస్తారు. ఒకవేళ 3వ తేదీన ఏదైనా సెలవు ఉంటే 4వ తేదీన ఎన్నిక నిర్వహించుకోవచ్చని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది.

పగడాల సత్యనారాయణ రాజీనామాతో ఎన్నిక

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి వైఎస్సార్ సీపీకి చెందిన ఐదో వార్డు కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ గత ఏడాది జనవరిలో రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. అయితే ఈ పదవికి వైఎస్సార్ సీపీకి చెందిన 32వ వార్డు కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు ఎన్నిక కావడం లాంఛనమే. ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారమే సత్యనారాయణ రాజీనామా చేశారు. మొత్తం 32 మంది కౌన్సిలర్లు ఉండగా ఏడుగురు టీడీపీకి చెందిన వారు కాగా, 25 మంది వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఉన్నారు. వీరిలో ఒక కౌన్సిలర్ ఎన్నికల ముందు టీడీపీలో చేరడంతో ప్రస్తుతం టీడీపీకి ఎనిమిది మంది, వైఎస్సార్ సీపీకి 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీకి అత్యధిక సంఖ్యలో కౌన్సిలర్లు ఉండటంతో ఎన్నిక ఏకపక్షం కానుంది.

ఎమ్మెల్యే వసంత బహిరంగ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు

జి.కొండూరు: వైఎస్సార్ సీపీలో ఉన్నోళ్లంతా లోఫర్లే అంటూ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు డిమాండ్ చేశారు. మైలవరం టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. నమ్మిన నాయకుడి కోసం, పార్టీ కోసం, ప్రజల కోసం నిలబడిన నాయకులు లోఫర్లయితే ఒక పార్టీ నుంచి గెలుపొంది, పదవులు అనుభవించి, పార్టీకి వెన్నుపోటు పొడిచి మరో పార్టీలో చేరిన నాయకులను ఏమనాలని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో నియోజకవర్గానికి చింతలపూడి నుంచి నీళ్లు తెస్తానని ఇచ్చిన హామీ నీటి మూటలేనని తేలడంతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రతిపక్ష పార్టీ నాయకులపై ఎమ్మెల్యే అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో అధికారంలోకి వచ్చి, ఆ హామీలను అమలు చేయడం సాధ్యం కాదని చెప్పిన చంద్రబాబును ప్రశ్నించడం చేతకాక ప్రతిపక్ష పార్టీపై దుమ్మెత్తిపోయడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మామిడి రైతులకు అవగాహన సదస్సు

నూజివీడు: మామిడి తోటల్లో తామర పురుగుల నివారణకు మిత్ర పురుగులు, శిలీంద్రాలను వాడటం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని అంబాజీపేటలోని ఉద్యాన పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త చలపతిరావు అన్నారు. నూజివీడులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రైతులకు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మంగళవారం తామర పురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తామర పురుగుల ఉనికిని గుర్తించిన వెంటనే మామిడి తోటల్లో నీలం, పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక ప్రాంతంలోని రైతులు ఒకేసారి తోటలకు మందులను పిచికారీ చేయాలని చెప్పారు. నూజివీడు మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి మాట్లాడుతూ తామర పురుగుల బెడదకు వాడాల్సిన రసాయన మందుల వివరాలను తెలిపారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, హెచ్ఓ ఆర్.హేమ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బొర్రా కనక మహాలక్ష్మి

సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జి.కొండూరు: సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజలు దృష్టి సారించడం ద్వారా కరెంటు చార్జీలను తగ్గించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌కు ప్రభుత్వం నుంచి ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరులో ప్రధాన మంత్రి సూర్య ఘర్, ముఫ్త్ యోజన పై ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే వసంత పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన ప్రదర్శన

తిరువూరు: విద్యుత్ ఆదా చేయడంతో పాటు తక్కువ ఖర్చుతో సూర్యరశ్మితో విద్యుత్ తయారయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై తిరువూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో ఆర్డీఓ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి విద్యుత్ శాఖ నుంచి సహకారం పొందవచ్చన్నారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బోస్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కమిషనర్ లోవరాజు, తహసీల్దార్ లక్ష్మి, విద్యుత్ ఏఈ కృష్ణారెడ్డి, నగర పంచాయతీ, మెప్మా తదితరులు పాల్గొన్నారు. బోస్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోండి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు కోరారు. కేతనకొండ, తుమ్మలపాలెం గ్రామాల్లో సూర్యఘర్ యోజనపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేతనకొండలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. మిగిలిన మొత్తానికి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు పొందొచ్చని వివరించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీడీఓ సునీతశర్మ, సర్పంచులు ఎస్.నళిని ఆశాలత, బొమ్మ వెంకటరమణ, ఏపీఎం శోభన్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- మైలవరం: పీఎం సూర్య ఘర్ గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని డీపీఓ లావణ్య కుమారి అన్నారు. మైలవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పిస్తూ మైలవరం ప్రధాన రహదారుల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజన ప్రయోజనాలను పొందండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని పేర్కొన్నారు. గొల్లపూడిలోని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పథకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడంతో ప్రతి నెలా వచ్చే విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇందుకుగాను అతి తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణాలు ఇస్తున్నాయన్నారు. రెండు కిలోవాట్స్ సోలార్ వినియోగానికి 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. అనంతరం జగ్గయ్యపేట డివిజన్‌లోని పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేను ఇంటింటికీ వెళ్లి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుజని, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- మల్లేల (తిరువూరురూరల్): మండలంలోని మల్లేలలో మంగళవారం పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పిస్తూ మండల పరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. డీఎల్‌పీఓ శ్యామల, ఎంపీడీఓ రవిబాబు మాట్లాడుతూ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచి వంగూరు మరియమ్మ, వెలుగు, సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జి. కొండూరు అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



గొల్లపూడిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుహాసిని



తిరువూరులో నగర పంచాయతీ ఆధ్వర్యంలో మానవహారం



మల్లేలలో అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

ముగ్గురికి పాము కాట్లు

నూజివీడు: పాము కాటుకు గురైన పలువురికి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. ముసునూరు మండలం కాట్రేనిపాడులోని రాజీవ్‌నగర్‌కు చెందిన బొకినాల శ్యామల (35) తోటి కూలీలతో కలిసి సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో మొక్కజొన్న తోటలో పనికి వెళ్లింది. అక్కడ ఆమెను పొడపాము కరవడంతో తోటి కూలీలు నూజివీడులోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం సింగన్నగూడేనికి చెందిన ఈతాకుల చలమయ్య (65) మంగళవారం ఉదయాన్నే పొలంలోకి వెళ్లి గడ్డి కోస్తుండగా పసికిరి పాము కరిచింది. అతడిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. నూజివీడు మండలం నర్సాపేటకు చెందిన రామిశెట్టి సత్యనారాయణ(39) ఆదివారం సాయంత్రం పొలంలోకి వెళ్లగా అక్కడ కాలుపై పాము కాటు వేసింది, ఆయన ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోతనపల్లి తండాలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పరారైన లావూరి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు పలు ప్రవేశ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు అన్నారు. మంగళవారం స్థానిక వాహినీ కాలేజీలో ఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గేట్ పరీక్షకు ఉన్న ప్రాధాన్యత, ఉపాధి అవకాశాలను ఇంజినీరింగ్ విద్యార్థులకు వివరించారు. ఎంటెక్, ఎంబీఏ తదితర కోర్సులకు కూడా డిమాండ్ ఉందన్నారు. ఇంజినీరింగ్ అర్హతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగావకాశాలు, వాటికి సిద్ధమయ్యే విధానాన్ని ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్ వివరించారు. వాహినీ కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కోశాధికారి ముత్యాల కిశోర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర కిరణ్ కుమార్ పాల్గొన్నారు.